శ్రీమతి భాగవతుల గాయత్రి

# నాకూ ... నీకూ ... మధ్య

"అమ్మ...హుం...హుం...అమ్మ కావాలీ...ఊ...ఊ..."

"తెల్లవారిందీ నీకు...నోరుమూస్తావా లేదా! ...సూర్యుడు పొడవకుండా లేచి, అర్ధరాత్రి దాకా ఒకటే ఏడుపు ఎన్నాళ్ళేడుస్తావే...పగలంతా చాకిరీతో ఒళ్ళు హూనమయ్యి...కాస్త నడుం వాల్చి కునుకుపట్టే వేళకి...నీ అంకమ్మశివాలు మొదలు...దరిద్రపు దానా ... పడుక్కో..."

"అత్తమ్మా ... అమ్మ ... అమ్మేదీ ... అమ్మ కావాలి ... హుం...హుం..."

"......"

"ఊ...ఊం...అమ్మ ..అమ్మ కావాలి "

"ఛఫ్, నోరు మూస్తావా లేదా? ..." నడ్డిమీద ఒక్కటి వేసిన శబ్దం నిశీధిని చీల్చుకొని ప్రక్కవాటాలో నిద్రపట్టక దొర్లుతున్న పార్వతీశంగారికి ఛెళ్ళుమని తగిలింది. ఇక పడుకోలేక లేచి నిటారుగా మంచం మధ్యని మఠంవేసుకు కూర్చుని పొడుంకాయ కోసం తలగడ క్రింద వెతకసాగేరు. మళ్ళీ ఏడుపు తారస్థాయినందుకొంది. ఈసారి ఒకటికి మరి రెండు కలిపి నడ్డిమీద మద్దెల వాయిద్యం!

"ఏడవను ... అబ్బ! కొట్టకు అత్తమ్మా ... కొట్టకు ... అమ్మ వద్దు ... ఒద్దే ఒద్దు ..." నోరు బలవంతాన మూసుకొని ఏడుపుని అదిమిపెట్టి బెక్కుతున్న చప్పుడు ... ఆ తరవాత మెల్లి మెల్లిగా...తగ్గి అంతా నిశ్శబ్దం అలుముకొంది.

ఒకసారి బాగా తెలివి వచ్చేయడంతో తిరిగి నిద్రపట్టలేదు పార్వతీశంగారికి. లేచి మెల్లిగా తడుముకుంటూ 'స్విచ్చి' నొక్కి బల్లమీద బోర్లించి పెట్టిన తన చేతి గడియారాన్ని తీసి నడుస్తున్నదో లేదోనని చెవిదగ్గర పెట్టుకొని ఒక్క క్షణం టక్...టక్... శబ్దం విని అది యింకా విశ్వాసంగా పని చేస్తున్నందుకో ఏమో తృప్తిగా తలనోసారి తాటించి కళ్ళకి దగ్గిరగా పెట్టుకొని ముళ్ళు ఎక్కడున్నాయో చూసి

"అబ్బో...నాలుగవ్వస్తోందే...ఇహ లేవొచ్చు ..." అనుకొని బద్ధకంగా ఒకసారి ఆవలించి, వాచీనితిరిగి యథాస్థానంలో బోర్లించి పెట్టి బల్లమీద మూలకి వ్యాస పీఠాన్ని అలంకరించి వున్న 'భగవద్గీత' నందుకొని ఈజీ ఛైర్లో మేను వాల్చేరు. కుర్చీ కింద క్రితం రాత్రి భద్రపరచిన కళ్ళజోడందుకొని కళ్ళకి తగిలించుకొని నిన్న చదివి గుర్తుపెట్టుకొన్న పేజీతీసి చదవడం మొదలుపెట్టేరు.

కానీ పుస్తకంలో కృష్ణార్జునుల రూపుకు బదులుగా మాధురి పసిడి మొహం ... ఏడుపు నడుపులో పెట్టుకొందుకామె చేస్తున్న ప్రయత్నమే గోచరించసాగేయి.

"పిచ్చిపిల్ల...ఎంత కలవరించి పోతోందో తల్లికోసం ... ఆ భగవంతుడికి దయాదాక్షిణ్యాలు లేవా? ... పసిదాన్ని కన్నవాళ్ళకి దూరంచేసి ఆమె కంటికి కడివెడుగా రోదిస్తూవుంటే ... చూసి ఆనందించేటంత 'శేడిస్టా' ఈ దేముడు?..." అనుకోకుండా చేతిలో పుస్తకం జారి ఒళ్ళోపడింది బరువుగా ... గబుక్కున దాన్ని ఎత్తి కళ్ళ కద్దుకొని తిరిగి చదవడానికి ప్రయత్నం మొదలెట్టేరు.

మస్తిష్కంలో సాగుతున్న ఆలోచనల ఒరవడికి మనసులో చదువుతున్న శ్లోకాలు మెదడు వరకూ చేరకుండానే కొట్టుకు పోతున్నాయి.

'ఇవాళ ఇక సాగదు ..' అనుకొని పుస్తకంమూసి టేబుల్ మీదనున్న వ్యాస పీఠంలో పెట్టి కాలకృత్యాలు తీర్చుకొందుకి పెరట్లోకి నడిచారు.

నూతి చప్టామీద చిన్న క్రస్టూలుమీద కూర్చొని ముకుంద మాల జపిస్తూనే ఒకొక్క బాల్చీడు నీళ్ళూ తోడుకొని తలారా స్నానంచేసి, చలికి ఒణుకుతున్న స్వరంతో 'గంగేచ, యమునే చైవ, గోదావరి, సరస్వతి నర్మదే సిన్ధు కావేరి, జలే స్మిన్ సన్నిధిం కురు!'

మరొక బాల్చీడు నీళ్ళు తలమీద దిమ్మరించుకుంటూ అనుకున్నారు ...

'ఈ సరిపెట్టుకోవడం అన్నది వేదాల నుంచీ వస్తున్నదే... లేకపోతే ఈ మారుమూల త్రిశంకుస్వర్గం లాంటి పల్లెకీ పట్నానికీ మధ్యగావున్న ఈ ఊళ్ళో నూతిలో నీళ్ళు నా బుర్రమీద పడగానే మహానదీ జలాలుగా మారిపోవాలని నే కోరుకుంటే అది అత్యాశ కాదూ! ..' తువ్వాలుతో నడ్డి తుడుచుకుంటూ విరక్తిగా నవ్వుకున్నారు పార్వతీశంగారు.

'ఇవాళ మెలుకువ రావడమే మాధురి ఏడుపుతో ప్రారంభించడం...రోజంతా ఇదే విధంగా సాగేలా వున్నాయి ఆలోచనలు ...' గత నెల్లాళ్ళుగా పక్కింట్లో జరుగుతున్న రభస ఆయన మనసుని కలచి వేస్తోంది. గాంధీ మహాత్ముడన్న వాక్యం– "నా తల్లి చాలా ఏళ్ళ క్రిందటే పోయింది. కానీ అప్పటి నుండి 'గీత' అనెడి తల్లి నా ప్రక్కనవుండి నన్ను కాపాడుచున్నది. కష్టములు కలిగినప్పుడు నేనామె ఒడిలో తలదాచుకొందును." పదే పదే మననం చేసుకొని

గీతలోనే, తోడూనీడా వెతుక్కొని కాలంవెళ్ళబుచ్చుతున్న పార్వతీశం గారు ఈ రోజు 'గీత'లో సేదతీర లేకపోయారు.

"గాంధీ మహాత్ముడూ... నేనూ... మరెందరో గీతలో తల్లిని చూసుకుంటాము కానీ ... చిన్నారి మాధురి? ... ఆమె ఎవరిలో చూసుకుంటుందని తల్లిని ?... అత్తలో చూద్దామనుకొంది ... కానీ దొరకలేదు ఆమెకు కావలిసిన మాతృత్వం అత్తమ్మలో..." వెనుతిరిగి తుడుచుకుంటూ యధాలాపంగా చూసిన పార్వతీశానికి పిట్టగోడకి అటుగా పెరటి అరుగుమీద మెట్లకి ఆనుకొని ఒక చిన్న ఆకారం కదిలినట్లయింది.

బట్టలు మార్చుకొని తడిబట్ట పిండి తాడుమీద ఆరేసి తల తుడుచుకుంటూ పెరటి గోడ దగ్గరగా వెళ్ళితే వెలుగులో అస్పష్టంగా కనిపిస్తున్న ఆకృతివైపు చేతిని చాపి మెల్లగా ... 'ఎవరదీ...?' అన్నారు

'నేనే...తాతయ్యా...' అంది మాధురి మెల్లగా.

'ఓసి పిచ్చిపిల్లా...నువ్వటే? ... ఇంత చలిలో ఆరుబయట కూర్చుని ఏం చేస్తున్నావూ ? ... పో... లోపలికి పోయిపడుకో ...' అన్నారు మందలిస్తూ.

'ఉహుం ... నిద్ర రావటం లేదు ...' అంది తల అడ్డంగా ఊపుతూ.

"వస్తుంది తల్లీ...ఇంట్లోకి నడు ముందు...చలికి జలుబు చేస్తుందీ..." ఆయన మాటలు లక్ష్యపెట్టని దానిలాలేచి పరికిణీ దులుపుకుంటూ పిట్టగోడ దగ్గరగావచ్చి తలఎత్తి —

"తాతయ్యా...ఇంత చలిలో చన్నీళ్ళు పోసేసుకున్నారు కదా మీకు జలుబు చెయ్యదూ మరి...?" అంది అమాయకంగా.

"ఓసి ... భడవా ... నా మాటలు నాకే అప్ప చెప్తున్నావా? చిలకలా? దా ... మనిద్దరం కలిసి పూలుకోద్దాం పూజకి.. " అని చేయి అందించి మాధురిని పిట్టగోడ మీదకి లాగి తనవైపు దింపుకున్నారు పదిలంగా. ఇద్దరూకలసి నందివర్ధనాలూ, పారిజాతాలూ, మందారాలూ కోశారు బుట్టనిండా . ఆ ప్రత్యూషలో వయో తారతమ్యాలు మరిచి ఒకరి కష్టసుఖాలొకరు ఏకరువు పెట్టుకున్నారు. ఒకరి కన్నీళ్ళొకరు తుడుచుకున్నారు . పకపకా నవ్వుకున్నారు.

"అమ్మడూ...కాఫీ తాగుదాం నువ్వు నోరుకడుక్కొని లోపలికొచ్చేయ్ . " అంటూ లోనికి వెళ్ళి వంటింటి తలుపు చప్పుడు కాకుండా తెరిచి లైటువేసి మెల్లిగా ఒకొక్క వస్తువే తీసి గది మధ్యగా పెట్టుకొని స్టౌ వెలిగించి కాఫీ పెట్టే ప్రయత్నంలో పడ్డారు.

మాధురి వచ్చి వింతగా ఆయన చర్యల్ని గమనిస్తూ గుమ్మం మీద కూర్చుంది. చిన్నపీట వాల్చి చేత్తో దానిమీద కూర్చోమని సైగ చేసేరు. మెల్లగా వచ్చి కూర్చుంది మాట్లాడకుండా.

కాఫీ రెండు గ్లాసుల్లోపోసి 'ఇవి పట్టుకు ముందు గదిలోకి పద ..' అన్నారు.

మాధురిలేచి గ్లాసులు తీసుకొని ముందుగదిలోకి నడిచింది.

స్టౌ ఆర్పి వంటింటిని యధాస్థానంలోసర్ది తలుపు దగ్గరగా వేసి ముందు గదిలోకి వచ్చేసరికి పార్వతీశంగారి కళ్ళజోడు తగిలించుకొని "గీతా మకరందం"లో పేజీలు గబగబా తిప్పుతోంది మాధురి.

'ఇదుగో...ఆ పుస్తకం అక్కడపెట్టి కాఫీతాగు ముందు...' అన్నారు.

ఆయనవైపు తిరిగి చిలిపిగా నవ్వి ... 'ఇందులో బొమ్మలే లేవు...' అంది కళ్ళజోడు తీస్తూ.

'అది బొమ్మల పుస్తకం కాదులే...పెద్దవాళ్ళది...'

"పెద్దవాళ్ళకి బొమ్మలక్కర లేదా ? ... మీకు బొమ్మలు నచ్చవా ?"

'బొమ్మలందరికీ నచ్చుతాయిగానీ అంతోటి చదవాలంటే మరి బొమ్మలుచూస్తూ కూచుంటే ఎలా ? ... ' అన్నారు ఏమని చెప్పాలో తెలియక తన సమాధానం తనకీ నచ్చలేదు.

"పోనీ బొమ్మల పుస్తకమేదేనా వుందా? ... " అంది కాఫీ ఊదుకుంటూ.

"లేదు తల్లీ ... ఇవాళ కొంటాలే నీకు మంచి బొమ్మల పుస్తకం..."

"ఇంత పెద్దది కావాలి . " అంది గీత చూపెడుతూ.

'అమ్మో... అంత పెద్దదే ... చూద్దాంలే ...' అన్నారు నవ్వుతూ.

చటుక్కున గుర్తొచ్చింది పార్వతీశంగారికి 'అవునూ ... బొమ్మల రామాయణం, భారతం, భాగవతం, పంచతంత్రం.. ఇలా ఎన్నో బొమ్మలతో పిల్లలకోసం ముద్రించేరుగానీ గీతని ఎందుకు పిల్లలకి బోధపడేలా 'బొమ్మల గీత'ని వెయ్యలేదు చెప్మా? . అర్థం కాదని కాబోలు... గాంధీచెప్పిన 'అమ్మ'లాంటి గీతని పిల్లలకెందుకు దూరంగా వుంచాలి? . పిల్లలకే కదా అమ్మ అవసరం ఎక్కువ? " ఆయన ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ ప్రక్కవాటా లోంచి కాంతమ్మ కంఠం ఖంగుమంది. కాఫీ ఒక్క గుక్కలో ముగించి గ్లాసు ఠక్కుమని టేబుల్పై నుంచి నిటారుగా నిలబడింది మాధురి.

'ఏవండోయ్ . మిమ్మల్నే ... కొంప మునిగింది ... మీ మేనకోడలు ఎటో పోయిందండోయ్ ... పెరటి తలుపులు బార్లాతీసి పెట్టి ఉన్నాయ్ ఓయి దేముడో .. నేనెక్కడ వెతుకుదునురో... ఎక్కడికిపోయేవే ముదనష్టపుదానా' కాంతమ్మ కంఠం కఠోరంగా పరిసరాల్ని చీల్చుకొని పార్వతీశంగారి వాటాలో ప్రవేశించింది.

'మాధురీ ... వెళ్ళు ...' అన్నారు నెమ్మదిగా ఆమె తల నిమురుతూ.

బెదురు కళ్ళతో ఆయన వైపుచూసి తలనటూ ఇటూ ఊపింది.

'కొడుతుంది...' దుఃఖం ఆమె గొంతులో గడ్డ కట్టింది.

''కొట్టొద్దని నే చెప్తాగా ...పద'' మాధురి చేయందుకొని పెరటి గోడ దగ్గిరకి చేరుకొన్నారు.

'కాంతమ్మా...ఇటురా ..'

పక్షుల కిలకిలారావాలతో అప్పుడే తూర్పు తెల్లబడుతోంది. గంభీరమైన ఆయన స్వరం మృదంగ ధ్వనిలా కాంతమ్మ చెవుల పడింది.

చటుక్కున వంటింటి కిటికీలోంచి పెరట్లోకి తొంగిచూసి రయ్యిమని దూసుకువచ్చింది.

పిట్టగోడ మీంచి మాధురిని దింపి ఆమె చేయి విడిచిపెట్ట కుండానే ...

'ఇదుగో ... నీ పేనకోడలు .. ఇద్దరికీ నిద్రపట్టలేదు ... కబుర్లు చెప్పుకుంటున్నాం ... నేనే రమ్మని పిలచేను ..'' చాలా సౌమ్యంగా నచ్చచెప్పేరు.

''బాగుంది సంబడం ... తెల్లవారకుండా పెత్తనాలూ నువ్వూ ... నడు లోపలికి ...'' ఆయనకి ఒక్కమాట జవాబియ్య కుండా మాధురిని బరబరా లాక్కెళ్ళిపోయింది.

భారంగా నిట్టూర్చి వెనుతిరిగి గదిలోకెళ్ళి పడకుర్చీలో మేను వాల్చేరు.

ప్రక్క వాటాలో కాంతమ్మ భర్తని సాధించడం మొదలు పెట్టింది. అప్రయత్నంగా పార్వతీశంగారి చెవుల్లో దూరుతున్నా యా మాటల తూటాలు.

''మన పిల్లలతోనే మనం వేగలేక ఛస్తోవుంటే అదనంగా దాన్ని తెచ్చి తలకెక్కించేరు. ఇవాళ తిండి పెట్టగానే సరి పోయిందా?...రేపు పెళ్ళి చెయ్యొద్దూ?... మనకున్న పిల్లలు చాల రనా దాన్నికూడా వెంటేసుకొచ్చేరు?...అయినా బస్సు బోల్తాపడి పెద్ద ప్రాణాలు రెండూ గుటుక్కుమన్నా దీని పిండం గట్టిది. బతికి మన ప్రాణాలు తీస్తోంది. ఏ అనాథాశ్రమంలోనో ఇచ్చేయక...చెల్లి... చెల్లి కూతురంటూ నెత్తికెక్కించుకున్నారు. పోనీ వెనకేమైనా దాచేడా దాని బాబు అంటే . తిండికే ఠికాణాలేనివాణ్ణి తగులుకు పోయింది. ఛీ...ఛీ అయినా ఇంటి ఆడపిల్ల కులం కానివాడితో ప్రేమ...ప్రేమని తెగించి యిల్లు దాటిననాడే తీరిపోయింది రుణం. మనకెందుకు దీని గొడవ?...''

వడగళ్ళ వానలా కురుస్తున్న కాంతం వాగ్ధోరణిని ఎలా ఆపాలో తెలియని కామేశం నాన్చుతూ మెల్లిగా...

''ఊరుకో కాంతం...నేను అన్నీ చూస్తాగా...నువ్వెందుకు గొడవ పడతావు? కొన్ని రోజులు ఓపిక పట్టు. అసలే దిక్కుతోచక అది, అల్లాడిపోతూవుంటే...మనంకూడా కాదంటే ఎక్కడికి పోతుంది చెప్పు. కొంచెం పెద్దది కాగానే అదే అర్థం చేసుకుని మసలుకుంటుంది. నీకు బరువుగా వుండదు. నా మాట నమ్ము.''

''బరువు కాక మరేమిటండీ. నా పిల్లలతో సమంగా తిండీ బట్టా పెట్టాలా? అనవసరపు ఖర్చు. అక్కరలేని బాధ్యత. లోకా నికి దడిసి ఊరుకొంటున్నాను కానీ...''

పార్వతీశంగారు విరక్తిగా నవ్వుకున్నారు.

''అనవసరపు ఖర్చు. అక్కరలేని బాధ్యత!'' నిజమే...తనూ అక్కరలేని బరువే మరి. ఎవరికి ఉపయోగమని తింటున్నాడు? ఎందుకోసం బ్రతుకుతున్నాడు? రిటైరయ్యి సంవత్సరంన్నర అయింది. 'అది' పోయి నాలుగేళ్ళయింది. అదృష్టవంతురాలు! ఎవరికీ అదనపు బరువు కాకుండానే తప్పుకొంది. తను? ప్రక్క గదిలో నిద్రలోవున్న కోడలు ఏడుకొట్టేకలేచి తన పనులు చూసు కొని తనకి ఇంత అన్నం పెడుతుంది. దానికోసం తాను బ్రతికి ఉన్నాడు.

ఎన్నోసార్లు...ఎన్నెన్నోసార్లు...'ఈ చాకిరీ చెయ్యలేక ఛస్తు న్నాను బాబూ . ఒక్కపూట వంట మానేసి బయట తినడానికే లేదు. ఎంత ఉండి ఏం లాభం' అంటూ విసుక్కోడం చెవులారా విన్నాడు. అవునుమరి...పోనీ వాళ్ళతోపాటు పైన హోటల్లో తాను తినలేడాయె. తనకోసమైనా వండక తప్పదుకదా? 'అది' వుంటే తనకీ ఇక్కట్లు లేకపోను. అక్కడికీ అన్ని పనులూ స్వయంగా చేసు కోవడం అలవర్చుకొన్నాడు అరవయ్యో ఏట! ఎవరి పనులు వారివి. ఎవరి విషయాలు వారివి! పెద్దతనాన్ని పురస్కరించుకొని ఎందులో నైనా సలహా చెప్పబోతే... ''మీకెందుకూ...హాయిగా విశ్రాంతిగా వుండక లేనిపోని గొడవల్లో తల పాడుచేసుకోకండి'' అంటారు.

''ముసిలి కాలంలో ఇంత తిండి పెట్టేవాళ్ళుంటే ఇంకేం కావాలి?'' అంటారే గానీ తన కడుపుకింత తిండికంటే ఊరటనిచ్చే ఒక్కమాట ఖర్చుచెయ్య రెవ్వరూ.

''నీకేమోయ్...రాజా జీవితం. సకాలంలో కూతురి పెళ్ళి చేసేశేవు. కొడుక్కు దర్జా అయిన ఉద్యోగం వేయించేవు. హాయిగా కృష్ణా...రామా...అనుకో ఇంక'' అంటారు తోటివాళ్ళూ...బాధ్య తల్లో మునిగి తేలుతున్నవాళ్ళూ...ఈర్ష్యగా.

తన కిప్పుడు తెలుస్తోంది తోడులేని జీవితం ఎంత దుర్భ రమో! తనకిప్పుడు కబుర్లు చెప్పుకొందుకొక తోడు కావాలి. పెన వేసే బంధం కావాలి!... ఎలా?...ఎలా?

''మందులు వేళకి తింటున్నారా?''

''భోజనం చేశారా?''

''బజార్లో ఏమైనా కావాలా?''

'ఇంతే ... వీటితో తన అవసరాలు చూస్తున్నామను కొంటాడు సూర్యం. ఊరికే తినడం కూర్చోడం ఎన్నాళ్ళిలా? క్రమ బద్ధమైన జీవితానికి, అలవాటుపడిన జీవితానికి రిటైరయ్యాక కొన్నాళ్ళు విశ్రాంతి ఎంతో హాయనిపించింది. కానీ అదే శాశ్వత మంటే రోత పుడుతోంది.'' ఆలోచనలతో మెదడు వేడెక్కి జ్వరం వచ్చినట్లయింది. అలసటగా పూజ కూడా మాని అలాగే నిద్ర కొరిగారు పార్వతీశంగారు.

★ ★ ★

''అన్నీ మూత పెట్టేను. ఆకలేసినప్పుడు వడ్డించుకు తినే యండి. నేనలా సుశీల ఇంటికెళ్ళి వస్తాను..'' మౌనంగా తల ఊపేరు పార్వతీశంగారు. ''ఆకలేస్తున్నట్టే వుంది. పోనీ పెట్టేసి వెళ్ళకూడదూ . సరేలే. లేచి తినేస్తే పని పూర్తయినట్టే ఈ పూటకి'' అనుకొని వంటింట్లోకి నడిచి పదార్థాలన్నీ వడ్డించు కొని కూచున్నారు. అన్నీ ఏమున్నాయ్? గుమ్మడికాయ కూర. తిన కూడదు. పప్పులో పోపు వేసింది. సయించదు. ఇక మిగిలినది చారే.

''తినమంటే అలా కూర్చుంటావేమే. మింగూ...ఈ తిండి కోసమే గద ఈ కొంపలో దిగేవు ''

నోటిదాకా వచ్చిన 'కడి' టప్పుమని కంచంలో పడింది. అన్నం.. అన్నం...బాధ్యత పెట్టే అన్నం! ముసిలి కాలపు అన్నం! దీనికోసమేనా జీవితమంతా ధారపోసి సంసారంలో నలిగి ఒడ్డున పడేదీ...దీనికోసమేనా? భార్య పిల్లలూ మనుమలూ అంటూ సర్వ సంగ పరిత్యాగి తన గోచీగుడ్డ కాపాడుకుందుకోసం సంసార ఝంజాటంలో పడ్డరీతిగా ఈ ''ముసిలికాలపు ముద్ద''కోసం బ్రతు కంతా బంధాలను పెంచుకుంటూ పోవాలా?

కాదు...దీనికోసంకాదు...మరి దేనికోసం?

బ్రతుకు భారమైపోకుండా బాధ్యతలను తనకు తానే సృష్టించుకుంటాడు మానవుడు. మళ్ళీ 'బాధ్యతలతో బ్రతుకు బరువైపోయిందే' అని విచారిస్తాడు...ఎంత విచిత్రం!

బరువు బాధ్యతలులేని జీవితం నిస్సారమైనది. ప్రాణం వున్నంతవరకూ అవి తప్పవు.

లాభంలేదు.. మానసికంగా ఒంటరితనం తానిక భరించలేడు. ఈ ఏడాదిలోనే పదేళ్ళ వయసు పెరిగినట్లనిపిస్తోంది.

ఏదో మార్గం చూడాలి.

''క్షుద్రం హృదయ దౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరన్తప'' అన్నాడు కృష్ణపరమాత్మ. అంటే తిరిగి మొదటికి చేరేలా వుంది జీవితం అనుకుంటూ ప్రక్కవాటాలోకి నడచేరు పార్వతీశంగారు.

పార్వతీశంగారిని చూడగానే ఆదివారమని గుర్తువచ్చి అల వాటుగా చదరంగం బల్ల సర్దసాగాడు కామేశం.

అన్యమనస్కంగా కాస్సేపు పిక్కలు కదిపి

''కామేశం ఒక్కమాటోయ్...నువ్వేమీ అనుకోనంటే... మీ మాధురిని నాకు ఇచ్చేయకూడదూ.. పెంచుకుంటాను.''

''భలేవారేనండీ...మాధురినేం ఖర్మ ...నన్నే పెంచుకోండి. నాతోపాటే నా పిల్లలూ...భార్య...మాధురీ...అందరమూను...'' అన్నాడు నవ్వుతూ.

''నేను హాస్యంగా చెప్పటంలేదోయ్. నిజంగానే అడుగు తున్నాను. నువ్వెలాగూ పిల్లలుగలవాడివి. నాకూ ఒక తోడు కావాలని పిస్తోందీ వయసులో. ఏమంటావ్...'' కళ్ళు అరమూసి యోగ ముద్రలో ఉన్నట్టు చాలా నింపాదిగా అడిగేరు.

''ఎంత మాటన్నారు బాబాయ్‌గారూ ఈ వయసులో మీ కెందుకొచ్చిన శ్రమ? బంధకం అని గానీ లేకపోతే మీ చేతుల్లో పెరిగే అదృష్టంకంటే దానికేం కావాలి! మీ పిల్లలని పెంచి పెద్ద చేయడానికి ఎన్నెన్ని కష్టాలు పడ్డారో . ఎంతెంత త్యాగం చేసేరో నే నెరగనిదా? ఇప్పుడు హాయిగా నిశ్చింతగావుండే వయసులో మీ కెందుకొచ్చిన బాధ చెప్పండి'' నవ్వుతూనే తన మనసులోమాట చెప్పేడు కామేశం.

''నాకేమీ భారం కాదయ్యా. బంధక మంతకంటే కాదు. నిజానికి నా కిప్పుడేదో ఒక బంధకమే కావాలి. లేకపోతే జీవించడం ఎందుకనిపిస్తోంది. నా పిల్లలని పెంచినప్పుడు నేను యవ్వనంలో వున్నాను. నా భార్య నాకు అన్నివిధాలా సహకరిస్తూవుంటే వాళ్ళని నేను బాధ్యతతోనే పెంచేను. అయినా నా పిల్లలని నేను పెంచు కోవడంలో త్యాగమేముంది? ప్రయాణీకులని గమ్యానికి చేర్చే రైలు ఇంజనులా బ్రతికేను. ఎవరి గమ్యాలకు వారు చేరిపోయారు. ఇంజను మూలపడింది. కానీ 'వర్కింగ్ కండిషన్'లోనే వుంది. మూలకూచో అంటే అది యంత్రం కాబట్టి వుంటుందేమోగానీ, నాకు సాధ్యం కావటం లేదోయ్. నాకిప్పుడు నా వెనక తిరిగే రైలు పెట్టెలు కావాలి'' అన్నారు హాస్యధోరణిలో భుజాలు కదిలేలా నవ్వుతూ.

''కానీ... మీ కోడలూ ... అబ్బాయీ'' నాన్చుతూ అసలు విషయం బైట పెట్టేడు కామేశం.

''నీకా భయమేమీ అక్కరలేదు. నాకు తోడు ఇంకొకరి భారం వాళ్ళమీద వెయ్యను. మా తాత తొంభయ్యేళ్ళు బ్రతికేరు. మా తండ్రి ఎనభయ్యేళ్ళు. నాకిప్పుడు అరవై. ఇంకా ఎంతలేదన్నా పదిహే నిరవైయ్యేళ్ళు నిరాఘాటంగా బ్రతికేస్తాను. నేనూ .. మాధురీ మా స్వగ్రామం వెళ్ళిపోతాము అక్కడ నాకో పాడుపడ్డ యిల్లూ కొంత భూమీ వున్నాయి. నా ముసిలిదేహం, కానీ పరక ఆస్తి లేకపోతే నా పిల్లలు బ్రతకలేకపోరు. నా అవసరం వున్నదగ్గిరే నేనుంటాను శరీరం లొంగినంతవరకూ. చీకి పారేసిన టెంకలోంచే క్రొత్త మొలక పుట్టినట్టు నా చేతుల్లో మాధురి పెరుగుతుంది.

అంతగా మధ్యలో నేను తనువు చాలిస్తే నువ్వుండనే వున్నావు. నీ అదనపు బరువుని నాకు వరంగా యియ్యి'' అన్నారు దోసిలిపట్టి దీనంగా.

కామేశం కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి.

''బాబాయిగారూ మీదెంత మంచి మనసు, నా అవస్థని గమనించి మీరీ నిర్ణయాని కొచ్చేరనిపిస్తోంది నాకు. ఏమైనా మాధురి అదృష్టం ఏమని చెప్పను? భగవంతుడే దాని బాధ చూళ్ళేక మిమ్మల్ని పంపేడు. తల్లి లేక అది విలవిల లాడిపోతోంది. నా భార్య అర్థం చేసుకోదు'' అన్నాడు ఆయన చేతులు పుచ్చుకొని కన్నీరు కారుస్తూ.

''నాకు తెలుసాబాధ కామేశం. నాకూ ఇప్పుడు అమ్మ కావాలి! మాధురి నాకు తల్లి. నేను ఆమెకు తాతను!'' అన్నారు వాతావరణం తేలికపరుస్తూ.

ఇంతలో మాధురి పరుగు పరుగున వచ్చి తాతగారి చెయ్యి విప్పి అత్త చూడకుండా తెచ్చిన బెల్లంముక్క సగంవిరిచి గుప్పిట్లో పెట్టి చెయ్యిమూసింది. మాధురిని ముద్దాడి ఎత్తుకొని 'నాతో మనూరు వస్తావా? నీకు బోలెడు తినడానికీ ఆడుకుందికీ యిస్తాను' అన్నారు.

'ఓ...వస్తాను. మరి మావయ్య...' ఆ పిల్లకి ఏమీ తెలియకపోయినా రక్తసంబంధం పీకింది.

''మీ మావయ్య అప్పుడప్పుడు నిన్ను చూడ్డానికి వస్తాడులే. నీకు జడవేస్తానూ, బొట్టు పెడతాను, చదువు చెప్తానూ, మరి నువ్వూ నేనూ ఒక జట్టు...ఏం...''

''ఓ వస్తాను. నేను పెద్దయ్యాక అన్నం వండేసి ఇలా నోట్లో పెట్టేస్తాను మీకు'' అంది ముద్దు ముద్దుగా చేతులు ఊపి. ఆ మాటలకి పార్వతీశంగారు, కామేశం పకపకా నవ్వేరు.

ఒకరి ఆసరాతో ఒకరు చేతులు కలిపి నడుస్తూ సాగిపోతున్న వాళ్ళని చూసి ఏమిటీ వింత అనుబంధం వీరిద్దరిమధ్యా పెనవేసుకుపోయింది? ఆ భగవంతుని లీల అమోఘం అనుకున్నాం తృప్తిగా.

* * *

బట్టలు పెట్టెలో సర్దుతున్న మామగారినీ, మాధురినీ మార్చి మార్చి చూస్తూ వింతగా అడిగింది కోడలు.

''ఎక్కడికీ ప్రయాణం?''

''మనూరికి'' ముక్తసరిగా జవాబిచ్చేరు.

''అదేం?''

''అక్కడే వుండాలనుకుంటున్నా కొన్నాళ్ళదాకా!''

''బాగుంది...ఇప్పుడీ వయసులో ఈ కుర్రదానికోసం వేరే వుంటారా? నలుగురూ నవ్విపోతారు.''

''అబ్బాయిని పిలుస్తావా ఒక్కమారు.''

నిద్రపోతున్న అబ్బాయి లేచి గాభరాగా వచ్చేడు.

''ఇదేమిటి నాన్నగారూ. అంతగా అయితే ఆ పిల్లనీ మీతో ఇక్కడే వుండనియ్యండి. ఇంత తిండికేం భాగ్యం? దానికోసం మీరు ఎక్కడో వుండాలా? దిక్కులేనట్టు!''

''దిక్కులేని వారికి దిక్కుగా వుండడంలోనే తృప్తివుందిరా అబ్బాయ్. ఇంతకీ నేనేం దేశం వదిలి పోవడంలేదుగా. మనూరికే. మాధురి బాధ్యత తీరేదాకా అక్కడే వుంటాను. ఆ తరవాత ఇక్కడకి వద్దన్నా వస్తాను. నన్నాపకు.''

కొడుకూ కోడలూ ఎంత వారిస్తున్నా వినకుండా నిద్రపోతున్న మాధురిని భుజంపై వేసుకొని పెట్టె చేత్తో పట్టుకొని వీధిలోకి నడిచేరు పార్వతీశంగారు.

''నేనేం తక్కువ చేసేనని... ఆయనలా వెళ్ళిపోవడం. రేపు నలుగురూ నన్నే అంటారు. మధ్యలో నాకొచ్చి పడింది చావు'' విసుక్కుంటూ విసవిసా వెళ్ళిపోయింది గదిలోకి.

''ఎందుకని వెళ్ళిపోతున్నాయన? కడుపున పుట్టిన పిల్లలకంటే ఎక్కువా? ఏమిటి ఆ దిక్కులేని దానికీ ఆయనకీ మధ్య సంబంధం? రానురానూ మతి పోతోంది నాన్నగారికి'' బాధగా కణతలు నొక్కుకున్నాడు కొడుకు సూర్యం.

ఎవరి హావభావాలతోనూ ప్రమేయం లేనట్టు ''అమ్మపెట్టిన తాయిలం ఎవరికంటా పడకుండా భద్రపరుచుకుంటున్న 'బాలుడిలా' గబగబా సాగిపోయేరు, పండితులు 'మిధ్య' అని చెప్పే సంసార సమరంలోకి మళ్ళీ పార్వతీశంగారు 'పార్థుడిలా.''

